క్లుప్తంగా

భక్తులకు లక్ష్మీ కాసులు అందజేత



భక్తులకు లక్ష్మీ కాసులను అందజేస్తున్న కోట సునీల్‌స్వామి

చిల్లకూరు: గూడూరు పట్టణంలోని పటేల్ వీధిలోని సాయి సత్సంగ నిలయంలో గురువారం దీపావళిని పురస్కరించుకుని లక్ష్మీ పూజ ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి పలు రకాల అబిషేకాలు గావించిన అనంతరం కుంకుమ పూజలు నిర్వహించారు. లక్ష తులసి పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా అమ్మవారి మూలమూర్తికి ప్రత్యేకంగా కాసుల అలంకరణ చేశారు. సాయి సత్సంగ నిలయ నిర్వాహకులు కోట సునీల్ స్వామి పూజాది కార్యక్రమాలను పూర్తి చేసి భక్తులకు అమ్మవారి కాసులను అందించారు.

పాఠశాలలో ఎంఈఓ తనిఖీలు



పాఠశాలలో ఎంఈఓ కృష్ణయ్య

దొరవారిసత్రం: వేణుంబాకం గిరిజన కాలనీలోని ప్రాథమిక పాఠశాలను స్థానిక ఎంఈఓ కృష్ణయ్య శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన అపార్ ఐడీ అప్డేట్ ప్రోగ్రెస్ రికార్డ్స్, స్టూడెంట్ అకడమిక్ పెర్ఫార్మెన్స్ తనిఖీ చేశారు. భోజనం మెనూ ప్రకారం అందుతుందో లేదోనని ఆరా తీశారు.

నత్తనడకన పింఛన్ పంపిణీ



పింఛన్ నగదును అందజేస్తున్న చేస్తున్న ఎంపీడీఓ, నేతలు

సైదాపురం: మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో శుక్రవారం ఉదయం నుంచి నత్తనడకన పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం ఉదయం నుంచి సర్వర్ సరిగా పనిచేయకపోవడంతో పింఛన్‌దారులు ఇబ్బందులు పడ్డారు. మండలంలో 7126 మంది పింఛన్‌దారులుండగా 3599 మందికి మాత్రమే అందజేసినట్లు ఎంపీడీఓ పురుషోత్తం శివకుమార్ తెలిపారు. పలు చోట్ల పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీడీఓ పరిశీలించారు.

డీవీ సత్రంలో 97.32 శాతం

దొరవారిసత్రం: మండలం పరిధిలోని 4847 వివిధ రకాల పింఛన్లకు గాను శుక్రవారం 4771 మందికి సాయంత్రానికి అందించి 97.32 శాతం పంపిణీ చేశామని స్థానిక ఎంపీడీఓ గోవర్ధన తెలియజేశారు. మిగిలిన వారికి కూడా ఫోన్లు చేసి పింఛన్ నగదు అందజేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

95.82 శాతం పింఛన్లు పంపిణీ

సూళ్లూరుపేట: నియోజకవర్గంలోని ఆరు మండలాల పరిధిలోని 128 పంచాయతీలు, రెండు మున్సిపాలిటీల్లో 95.82 శాతం మందికి మాత్ర మే సామాజిక పింఛన్లు అందజేశారు. గంటపాటు సర్వర్లు పనిచేయకపోవడంతో బాగా ఇబ్బంది పడ్డారు. దీంతో పింఛన్ లబ్దిదారులు ఈరోజు ఇక వాయిదా పడినట్టే అనుకున్నారు. గంట తరువాత సర్వర్ పని చేయడంతో పంపిణీ ప్రారంభించి 95 శాతం మందికి అందజేశారు. మిగిలిన 4.18 శాతం మందికి శనివారం అందజేస్తామని సిబ్బంది చెబుతున్నారు. దొర వారిసత్రం మండలంలో 97.77 మందికి అందజేశారు. సూళ్లూరుపేట అర్బన్‌లో 94.44 శాతం మందికి అందజేశారు. రూరల్ పరిధిలోని దా మానెల్లూరులో టీడీపీ నాయకుల ఇంటికెళ్లి పింఛన్లు తీసుకోవాల్సి ఉంటుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పింఛన్ల పంపిణీలో టీడీపీ నా యకుడి పెత్తనం ఏంటని లబ్దిదారులు ప్రశ్నిస్తున్నారు.

కండలేరులో 45.318 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం నాటికి 45.318 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 10,000 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. సత్యసాయిగంగ కాలువకు 1350, పిన్నేరు కాలువకు 10, లోలెవల్ కాలువకు 10, హైలెవల్ కాలువకు 130, మొదటి బ్రాంచ్ కాలువకు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆగమోక్తంగా అమావాస్య ఉత్సవం



పురవీధుల్లో విహరిస్తున్న స్వామి అమ్మవార్లు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురువారం అమావాస్య ఉత్సవం ఆగమోక్తంగా నిర్వహించారు. ఆలయ అలంకార మండపంలో జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామికి పలు రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విశేషంగా అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం చప్పరాలపై అధిష్టించి పురవిహారం చేశారు. భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఊరేగింపులో భక్తులకు ప్రసాదాలను వితరణ చేశారు. కార్యక్రమంలో ఈఓ చంద్రశేఖర్ ఆజాద్, ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

చిరు విషం

- మార్కెట్‌లో నాణ్యత లేని చిరుతిండ్లు
- నకిలీలతో గుల్లవుతున్న ఆరోగ్యం
- చిన్నారులను ఆకట్టుకునేలా స్నాక్స్
- తనిఖీలు మరచిన ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు



దుకాణాలలో విక్రయిస్తున్న స్నాక్స్ ప్యాకెట్లు

చిల్లకూరు: చిన్నారుల నుంచి పెద్దల వరకు చిరుతిండ్లకు అలవాటు పడని వారుండరు. అందరికి నచ్చే స్నాక్స్ తయారిలో కొంత మంది తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. ప్రముఖ కంపెనీలకు చెందిన లేస్, కుర్కురేలకు నకిలీలు తయారై పోతున్నాయి. చిన్న అక్షరం మార్పులతో ఇవి మార్కెట్‌లో విరివిగా దొరుకుతున్నాయి. ఈ నకిలీ చిరుతిండ్లు హోల్‌సేల్ వ్యాపారుల నుంచి గ్రామాల్లోని చిన్న పాటి దుకాణాల ద్వారా విచ్చలవిడిగా విక్రయించి, సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో పలువురు చిన్నారులు అనారోగ్యం పాలై ఆసుపత్రులకు పరుగులు పెడుతున్నారు. రూ.5 ప్యాకెట్ కుర్కురే తిని రూ.5 వేల బిల్లు డాక్టర్లకు ఇవ్వాల్సి వస్తుందని తల్లిదండ్రుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

హానికర రసాయనాల వాడకం

స్నాక్స్ తయారీ ఒక ఎత్తు అయితే, వాటి ప్యాకింగ్ ఎంతో ఆకర్షణీయంగా ఉండేలా వ్యాపారస్తులు చూసుకుంటారు. దీంతో మారం చేసే చిన్నవాడు సైతం ఆకర్షణీయమైన ప్యాకెట్ చూస్తూనే సంతోషం వ్యక్తం చేస్తుంటారు. అలాంటి ప్యాకెట్‌లో ఉండే చిరుతిండిలో నాసిరకం కారం పొడి, ఉప్పు, రసాయనాలను కలుపుతున్నారు. కొన్నింటిలో టేస్టింగ్ సాల్ట్ కలపడంతో చిన్నతనం నుంచి ఆరోగ్యం గుల్ల అవుతుందని పలువురు వైద్యులు

తనిఖీలే లేవు

దుకాణాలలో పబ్లిక్‌గా లోకల్ స్నాక్స్ ప్యాకెట్లు విక్రయాలు సాగిస్తున్నా తనిఖీలు కానరావడం లేదు. ఆ దుకాణాలలో కానీ, వాటి తయారు చేసే చోట కానీ ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు తనిఖీలు చేసిన దాఖలాలు లేవు. దీంతోనే విచ్చలవిడిగా లోకల్ స్నాక్స్ తయారీదారులు ఎలాంటి బెరుకు లేకుండా పబ్లిక్‌గా విక్రయించేస్తున్నారు.

తల్లిదండ్రులను హెచ్చరిస్తున్నా, వీటిని అరికట్టే వారే లేకుండా పోయారు.

చిన్నపాటి మార్పులు

బ్రాండెడ్ కంపెనీలకు చెందిన పేరుతో ఉన్నట్లే చిన్నపాటి మార్పుతో ఈ స్నాక్స్ ప్యాకెట్లను తయారీ చేస్తుంటారు. దీంతో అసలు ఏవి, నకిలీ ఏవి అని చిన్న పిల్లలు వాటిని కనుగొనలేరు. వీటిని నెల్లూరు, చెన్నై, తడ ప్రాంతాలలో తయారు చేసి మినీ లారీలలో దిగుమతి చేసుకుంటున్నారు.

నెలకు కోటికి పైగా వ్యాపారం



హోల్‌సేల్ దుకాణంలో బస్తాలలో స్నాక్స్ ప్యాకెట్లు

గూడూరు మార్కెట్ నుంచి నెలకు ఒక కోటికి పైగా ఈ స్నాక్స్ వ్యాపారం సాగుతుందని అంచనా. ప్రధాన వీధుల్లో ఉన్న హోల్‌సేల్ దుకాణాల నుంచి డివిజన్‌లోని పలు గ్రామీణ ప్రాంతాలకు నిత్యం చిన్నపాటి వ్యాపారులు ఆటో, నాలుగు చక్రాల వాహనాలతో చేర వేస్తుంటారు. ఇలా ఒక నెలలో సుమారు కోటి రూపాయల వరకు ఈ స్నాక్స్ వ్యాపారం సాగుతోంది.

కమీషన్ మాయ

మార్కెట్‌లో స్నాక్స్ వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగుతోంది. దీనికి కారణం హోల్‌సేల్ వ్యాపారస్తులు కంపెనీ స్నాక్స్‌తో పాటుగా లోకల్‌గా తయారు చేసే స్నాక్స్ విక్రయిస్తుంటారు. అధికారులు దాడులు చేసిన సమయంలో అక్కడ అంతా కంపెనీకి సంబంధించిన సరుకు మాత్రమే కనిపిస్తుంది. లోకల్‌గా తయారు చేసిన స్నాక్స్ ప్యాకెట్లు మరో చోట గోదాముల్లో ఉంటాయి. అవి అక్కడ నుంచి చిన్న వ్యాపారులకు అందిస్తుంటారు. ఎందుకంటే కంపెనీ స్నాక్స్ 12 ప్యాకెట్లు ఉండే సరం విక్రయిస్తే రూ.6 మాత్రమే కమీషన్ వస్తుంది. అదే లోకల్‌వి విక్రయిస్తే రూ.20 ఆదాయం వస్తుంది.

జాగ్రత్తగా ఉండాలి

మార్కెట్‌లో లభ్యమయ్యే తినుబండారాలకు పిల్లలను దూరంగా ఉంచాలి. వీటిని ఆకర్షణీయంగా తయారు చేయడం, నిల్వ ఉంచేందుకు వీటిలో వినియోగించే రసాయనాలు ఆరోగ్యానికి చాలా హానికరం, కడుపు నొప్పి, లివర్, కిడ్నీ సమస్యలు ఉత్పన్నం అయ్యే ప్రమాదం ఉంది. పిల్లలు మారం చేసిన సమయంలో ఇంటి వద్ద బెల్లంతో తయారు చేసి ఉంచుకునే వేరుశనగ, నువ్వుల ముద్దలు ఇస్తే ఆరోగ్యంతో పాటుగా రక్తం వృద్ధి చెందుతుంది.

– డాక్టర్ సిద్దిక్, చిన్న పిల్లల వైద్యుడు, గూడూరు

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడితో నాయకుల భేటీ



భూమనను సత్కరిస్తున్న నాయకులు

సూళ్లూరుపేట: వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా నూతన అధ్యక్షుడిగా ఎంపికైన భూమన కరుణాకర రెడ్డిని తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి, సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, ఎంపీపీ అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ జెట్టి వేణుయాదవ్ శుక్రవారం తిరుపతిలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువాలతో ఘనంగా సత్కరించి జిల్లా పార్టీ అధ్యక్షుడిగా ఎంపికైన సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు.

పంచాయతీ కాంప్లెక్స్ నిర్మించొద్దు

బాలాయపల్లి(సైదాపురం): మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు కోసం కేటాయించిన స్థలంలో పంచాయతీ కాంప్లెక్స్ నిర్మించ వద్దని అంబేడ్కర్ యువజన సంఘం నేతలు పీఎంఆర్.నాగయ్య, కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు కేటాయించిన స్థలంలో శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు కోసం గతంలో అధికారులు స్థలం కేటాయించినట్లు తెలిపారు. అయితే ప్రస్తుత పంచాయతీ అధికారులు కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టేందుకు సన్నద్ధం అవుతున్నట్లు ఆరోపించారు. భవనం నిర్మాణానికి చర్యలు చేపడితే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

పంట కాలువ పూడ్చివేతపై ఫిర్యాదు

పెళ్లకూరు: మండలంలోని ఎర్రగుంట గ్రామం సర్వే నంబరు 237లో దళితుల భూములకు సాగునీరు సరఫరా చేసే వ్యవసాయ పంట కాలువను పూడ్చి వేయడంపై అధికారులకు ఫిర్యాదు చేశారు. ఎర్రగుంటకు చెందిన ఓ భూస్వామి కాలువను పూడ్చి వేయడంపై శుక్రవారం బాధితులు పోలీసులు, రెవెన్యూ అధికారులను ఆశ్రయించారు. 2010లో గ్రామంలోని నిరుపేదలకు సుమారు 50 ఎకరాలు ప్రభుత్వ భూమిని మంజూరు చేశారు. అయితే ప్రభుత్వ భూములకు సమీపంలో ఉన్న ఓ భూస్వామి వ్యవసాయ పంట కాలువను పూడ్చి వేసి, దుర్భాషలాడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ విషయంపై పరిశీలించి, చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

వేద విద్యార్థులకు నగదు ప్రోత్సాహం



నగదు అందజేస్తున్న దామోదర్‌రెడ్డి

వాకాడు: బాలిరెడ్డిపాళెం పట్టాభిరామాలయంలో శుక్రవారం సీతారామధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో వేద విద్యార్థులకు నగదు ప్రోత్సాహాన్ని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కొడవలూరు దామోతర్‌రెడ్డి చేతులు మీదుగా అందజేశారు. వేద విద్యను అభ్యసిస్తున్న విస్సా నితిన్‌కుమార్‌శర్మ, అరసి సాత్విక్‌శర్మలకు సంస్థ నగదు ప్రోత్సాహాన్ని అందజేయడం సంతోషకరమని దామోదర్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో దాతలు నాయుడు వెంకటరమణారెడ్డి, సరోజనమ్మ దంపతులు, సంస్థ ప్రతినిధులు దీవి అనంతాచార్యులు, కొడవలూరు హరీష్ రెడ్డి, వంశీ, సతీష్, రూపేష్, నీలిమ పాల్గొన్నారు.

కలువాయమ్మ గుడిలో హోమాలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

కలువాయి: గ్రామదేవత కలువాయమ్మ గుడిలో అమావాస్య సందర్భంగా శుక్రవారం దేవి మూలమంత్ర హోమం నిర్వహించారు. శుక్రవారం ఆలయంలో శ్రీమహాగణపతి పూజ, నవగ్రహ, మృత్యుంజయ, గ్రామ దేవతల మూలమంత్ర హోమంతోపాటు శ్రీమహాలక్ష్మీదేవి మూలమంత్ర హోమం నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతిని మజ్జేశ్వరునికి అందజేశారు. భక్తులు పూజల్లో పాల్గొని, అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమానికి ఉభయకర్తలుగా పునగాని మస్తానయ్య, మస్తానమ్మ దంపతులు వ్యవహరించారు.

చందనాలంకరణలో లక్ష్మీ నరసింహుడు



బంగారు గరుడ వాహనంపై ఊరేగుతున్న లక్ష్మీనరసింహుడు

రాపూరు: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి చందనాలంకరణలో భక్తులకు శుక్రవారం దర్శనమిచ్చారు. స్వాతి శ్రీవారి జన్మనక్షత్రం అయినందున స్వామివారి మూలమూర్తికి చందనంతో అలంకరించడం ఆచారమని దేవస్థాన ప్రధానార్చకులు తెలిపారు. స్వామివారికి ఉదయం అభిషేకం, చందన అలంకరణ, 9 గంటలకు శ్రీవారి నిత్యకల్యాణ మండపంలో శాంతి హోమం ,11 గంటలకు కల్యాణం, 1 గంటకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం శ్రీవారి అత్యంత ప్రియమైన బంగారు గరుడ వాహనంపై ఉత్సవమూర్తిని కొలువు దీర్చి వివిధరకాల పుష్పాలు, ఆభరణాలతో అలంకరించి మాడవీధుల్లో క్షేత్రోత్సవం నిర్వహించారు.

కారును ఢీకొన్న లారీ

ఓజిలి: మండలంలోని జాతీయ రహదారి ఓజిలి క్రాస్‌రోడ్డు సమీపంలో గురువారం కారును లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు డ్రైవర్ మాలిక్‌కు స్వల్పగాయాలయ్యాయి. పోలీసుల వివరాలు మేరకు పశ్చిమ బెంగాల్ నుంచి ఉల్లిపాయల లోడ్డుతో లారీ బయల్దేరింది. బెంగళూరు నుంచి నెల్లూరుకు కారు ఇదేమార్గంలో ప్రయాణిస్తోంది. ఈ క్రమంలో ఓజిలి క్రాస్ రోడ్డు సమీపంలోకి వచ్చే సరికి అతివేగంగా వచ్చిన లారీ ముందు వెళ్తున్న కారును ఢీకొట్టింది. దీంతో కారు డివైడర్ పైకి దూసుకెళ్లింది. కారు డ్రైవర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోనలో వైభవంగా రథోత్సవం



విశేషాలంకరణలో స్వామి, అమ్మవార్లు



కోన మాడవీధుల్లో రథోత్సవం

రాపూరు: ప్రముఖ పుణ్య క్షేత్రమైన పెంచలకోనలో స్వయంభువుగా వెలసిన శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో గురువారం దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని అత్యంత వైభవంగా రథోత్సవం నిర్వహించారు. ఉదయం 5 గంటలకు సుప్రభాతం, 6 గంటలకు మూలమూర్తికి పాలు, తేనె, పెరుగు, నెయ్యి, చందనం, పసుపు, కుంకుమ, కొబ్బరినీరు, తులసిమాల, వివిధ పళ్లరసాలతో అభిషేకం నిర్వహించారు. స్వామివారి మూలమూర్తిని చందనంతో అలంకరించారు. 8 గంటలకు స్వామివారి అలంకార మండపంలో శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మిదేవి, చెంచులక్ష్మి దేవతల ఉత్సవమూర్తులను కొలువుదీర్చి స్వామి, అమ్మవార్లను శ్రీకృష్ణుడు, సత్యభామగా వివిధ పుష్పాలు, ఆభరణాలతో శోభయమానంగా అలంకరించారు. రథంపై కొలువుదీర్చి కోన మాడవీదుల్లో క్షేత్రోత్సవం నిర్వహించారు. సంవత్సరంలో బ్రహ్మోత్సవాలలో ఒక సారి మాత్రమే రథోత్సవం జరుగుతుంది. దీపావళి సందర్భంగా రెండో పర్యాయం రథోత్సవం నిర్వహిస్తారు. ఈ రథోత్స వం ఆర్టీసీ బస్టాండు వరకు సాగింది. అక్కడ ఏర్పా టు చేసిన నరకాసురుని బొమ్మను స్వామి వారి విల్లుతో దహనం చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి, నరకాసురుని చరిత్రను అర్చకులు భక్తులకు వివరించా రు. కార్యక్రమంలో ప్రధానార్చకులు రామయ్యస్వామి, పెంచలయ్యస్వామి, అర్చకులు శశిస్వామి, వినోద్ స్వామి, నాగరాజస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా బెల్టు షాపుల జోరు



తాళ్వాయిపాడులో బెల్టు దుకాణంలో మద్యం అమ్మకాలు

పెళ్లకూరు: మద్యం బెల్టుషాపులు నిర్వహిస్తే ఉపేక్షించకుండా లైసెన్స్‌లు రద్దు చేస్తామంటూ సాక్షాత్తు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హెచ్చరికలు చేస్తున్నా ఇక్కడ అధికారులు మాత్రం భిన్నంగా వ్యవహరిస్తున్నారు. దీంతో ఊరూరా మద్యం బెల్టు దుకాణాలు ఊపందుకుని జోరుగా విక్రయాలు చేస్తున్నారు. కొత్త మద్యం పాలసీ అంటూ గొప్పలు చెప్పుకుంటున్న కూటమి ప్రభుత్వానికి మద్యం బెల్టు దుకాణాలతో ఆ పార్టీ కార్యకర్తల జేబులు నింపుకొనేలా పరోక్షంగా ఉపయోగపడుతున్నాయి. మండలంలోని 24 పంచాయతీలకు పెళ్లకూరు, చెంబేడు గ్రామాల్లో మాత్రమే రెండు మద్యం దుకాణాలు ఏర్పాటు చేశారు. అయితే ఎక్కువ మంది వ్యవసాయ కూలీలు, నిరుపేదలు అధికంగా ఉన్న ప్రాంతం కావడంతో కూటమి నాయకులు, కార్యకర్తలు ఊరూరా మద్యం బెల్టు దుకాణాలు ఏర్పాటు చేసేశారు. ఆటోల్లో బహిరంగంగా మద్యం సరఫరా చేస్తూ విక్రయాలు జోరుగా చేస్తున్నారు. తాళ్వాయిపాడు, కానూరు, చిల్లకూరు, పాలచ్చూరు, పుల్లూరు తదితర గ్రామాల్లో మద్యం బెల్టు దుకాణాలు జోరుగా సాగుతున్నాయి. ఈ విషయంపై ఎక్సైజ్ శాఖ సీఐ అరుణకుమారిని వివరణ కోరగా మద్యం బెల్టు దుకాణాలు నిర్వహిస్తే కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరుబాట

- డీసీసీబీ మాజీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి



తిరుపతి ఎంపీ గురుమూర్తితో మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య, డీసీసీబీ మాజీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, తదితరులు

పెళ్లకూరు: కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై అటు ప్రజలకు ఇటు కార్యకర్తలకు అండగా ఉంటూ పోరుబాట కొనసాగిస్తామని డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తిని మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యతో పాటు మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు చంద్రబాబు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే పోరుబాటకు తామంతా సిద్ధమవుతామని హెచ్చరించారు. మద్యం పాలసీ అంటూ ప్రజలను మభ్యపెడుతూ ఊరూరా బెల్టు దుకాణాలు టీడీపీ కార్యకర్తలే నిర్వహిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని తెలిపారు. రబీ సీజన్ మొదలైనప్పటికీ రాయితీపై విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పనిముట్లు అందిస్తారనే నమ్మకం కూడా లేదన్నారు. నమ్మి ఓట్లు వేసిన ప్రజలను కష్టాల పాల్జేయడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన వెంట సూళ్లూరుపేట ఎంపీపీ అనీల్‌రెడ్డి, నాయకులు వేణుయాదవ్ ఉన్నారు.

వేడుకగా దీపావళి సంబరాలు

నాయుడుపేట టౌన్: దీపావళి సందర్భంగా గురు, శుక్రవారాలు పట్టణంలోని ఏఎల్‌సీఎం మైదానంలో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాల వద్ద సందడి నెలకొంది. రాత్రి పట్టణంలో ప్రతి ఇంటా ప్రమిదలు వెలిగించి దీపావళి వేడుకలను ఆనందంగా నిర్వహించారు. నోములు చెల్లించుకునేందుకు మహిళలు పట్టణ పరిధిలోని పలు ఆలయాల వద్దకు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. పిల్లారిగుడి, శివాలయం, రాజగోపాలపురంలోని రామాంజనేయ ఆలయం, మూకాంబిక గుడి, వాసవి కన్యకాపరమేశ్వరి, రామాలయం, మహాలక్ష్మమ్మ ఆలయం, అంకాళమ్మ ఆలయం, శ్రీకృష్ణ మందిరం, దుర్గామల్లేశ్వరి దేవి ఆలయాల వద్ద నిర్వాహకులు ప్రత్యేకంగా కలశాలు ఏర్పాటు చేశారు.

సైదాపురం: మండలంలోని అన్ని గ్రామాల్లో గురువారం దీపావళి పండుగను ఘనంగా నిర్వహించా రు. ఇళ్ల వద్ద దీపాలు వెలిగించి బాణసంచా కాల్చా రు. ముఖ్యంగా చిన్న పిల్లలతోపాటు పెద్దలు కూడా దీపావళి పండుగను వైభవంగా జరిపారు. దీనికి తోడువర్షం పడకపోవడంతో ప్రతి ఇంటా దీపాలు వెలిగాయి. ప్రతి బాణసంచా దుకాణం కళకళలాడింది.

వెంకటగిరి(సైదాపురం): దీపావళి పండుగ పురస్కరించుకుని వెంకటగిరి పట్టణ, రూరల్ గ్రామాల్లో గురువారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని విశ్వోదయ కళాశాల ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాల వద్ద చిన్నారులు, యువకులు అధిక సంఖ్యలో టపాకాయలను కొనుగోలు చేసేందుకు ఎగబడ్డారు. వెంకటగిరి రాజా కుటుంబీకులు డాక్టర్ వీబీ సాయికృష్ణ యాచేంద్ర రాజాప్యాలెస్‌లో టపాకాయలు పేల్చి దీపావళి పండుగ నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దొంతుశారద, బాలకృష్ణ దంపతులు పట్టణంలోని బాలసదన్‌లో చిన్నారులతో కలసి దీపాలు వెలిగించి, వేడుకలు చేపట్టారు.

నగదు చెల్లించినా కౌలు చేయవద్దని హుకుం

చిల్లకూరు: శ్రీచెన్నకేశవ స్వామి దేవస్థానం భూములను వేలం పాట ద్వారా కౌలుకు దక్కించుకుని నగదు చెల్లించిన రైతును శుక్రవారం ఆలయ ఈఓ శశాంక్ సదరు భూమిని సాగు చేయవద్దని హుకుం జారీ చేశారు. చిల్లకూరు చెరువు కింద చెన్నకేశవ స్వామి ఆలయానికి కొంత భూమి ఉంది. ఆలయ భూములను కౌలు వేలం పాటలు నాలుగు రోజుల క్రితం బహిరంగంగా నిర్వహించి కౌలు మొత్తాన్ని అప్పటికప్పుడు రైతుల నుంచి తీసుకున్నారు. అయితే ఇందుకు సంబంధించిన రశీదులు మాత్రం ఇవ్వలేదు. వేలం పాటలో సర్వే నెంబర్ 280లోని 1.60 ఎకరాల భూమిని అరుంధతీవాడకు చెందిన హరి అనే రైతు రూ.23 వేలు చెల్లించి కౌలుకు దక్కించుకున్నాడు. అయితే స్థానికంగా ఉన్న అధికార పార్టీ చెందిన నాయకుడు ఆ భూమిని దళిత రైతుకు ఇవ్వకుండా మరొకరికి ఇవ్వాలని ఈఓపై ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం. దీంతో ఈఓ శశాంక్ రైతు హరికి సాగు చేయవద్దని హుకుం జారీ చేశారు. ఈ విషయమై ఈఓ శశాంక్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన ఫోన్ ఎత్తలేదు. దీంతో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసబాబు దృష్టికి సమస్యను తీసుకెళ్లగా పరిశీలిస్తామని అన్నారు.

పొట్టి శ్రీరాములు సేవలు చిరస్మరణీయం



పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య నాయకుల నివాళి

నాయుడుపేట టౌన్: ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రం కావాలని నిరహారదీక్ష చేపట్టి, అమరుడైన పొట్టిశ్రీరాములు సేవలు చిరస్మరణీయమని పలు సంఘాల నాయకులు కొనియాడారు. ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం పాత బస్టాండ్ వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం నాయకులు, ఇతర సంఘాల వారు వేర్వేరుగా పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో ఆర్యవైశ్య సంఘ తిరుపతి, నెల్లూరు జిల్లా రూరల్ అధ్యక్షులు గూడూరు కిషోర్‌కుమార్, కనమర్లపూడి సుబ్రమణి, సంఘ నాయకులు సొల్లేటి చంద్రశేఖర్, మెంటా మల్లికార్జునరావు, గూడూరు కిరణ్‌కుమార్, దేవతా నిరంజన్ తదితరులు పాల్గొన్నారు. పలు ప్రభుత్వ కార్యాలయాల్లో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ప్రభుత్వ భూముల్లో గ్రావెల్ దందా



పూలతోటమిట్ట ప్రాంతంలో గోతులుగా మారిన ప్రభుత్వ భూమి



పట్టపగలే ప్రభుత్వ భూమిలో గ్రావెల్ తరలింపు

- అధికారి పార్టీ నాయకుడి అండదండలతో అక్రమాలు
- రాత్రికి రాత్రే టిప్పర్లలో గ్రావెల్ తరలింపు
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం

దొరవారిసత్రం: అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు అండదండలతో ప్రభుత్వ భూముల్లో విలువైన గ్రావెల్ అక్రమంగా వివిధ పరిశ్రమలకు తరలిపోతున్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రావెల్ తరలించే అక్రమదారుడికి అధికార పార్టీ నాయకుడి అండ పుష్కలంగా ఉండడంతో రాత్రిళ్లు పదుల సంఖ్యలో టిప్పర్లకు గ్రావెల్ జోరుగా సాగుతుంది. ఈ విషయం తెలిసినా అధికార యంత్రాగం ఏమీ పట్టించుకోవడం లేదు.

పూలతోట మిట్ట కేంద్రం

పూలతోట పంచాయతీ పరిధిలోని పూలతోట మిట్ట గ్రామ ప్రాంతంలో ఎంతో విలువైన గ్రావెల్ భూములు పుష్కలంగా ఉన్నాయి. ఈ భూమి అంతా ప్రభుత్వ భూమి కింద ఉంది. ఈ ప్రాంతంలోనే కొందరు ఎస్సీ, ఎస్టీలకు సీజేఎఫ్ఎస్ భూముల కింద సాగు కోసం పంపిణీ చేశారు. ఈ భూములపై గ్రావెల్ అక్రమదారుడి కన్ను పడింది. దీంతో అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడి అండతో గ్రావెల్ అక్రమదారుడు గత కొన్ని రోజులుగా ప్రభుత్వ భూమితో పాటు, ఎస్సీలకు చెందిన భూముల్లో భారీ యంత్రాలు పెట్టి గ్రావెల్ తవ్వకాలు చేపట్టాడు. రాత్రికి రాత్రే పదుల సంఖ్యలో టిప్పర్ లారీలతో సూళ్లూరుపేట పట్టణ ప్రాంతంలోని లేఅవుట్లకు, పలు పరిశ్రమలకు తరలించేస్తున్నారు. విలువైన ప్రభుత్వ భూములు అంతా భారీ గుంటలు ఏర్పడి ఎందుకు పనికి రాకుండాపోయాయి. ఈ ప్రాంతంలో గ్రావెల్ తరలింపు గత కొన్ని రోజులుగా జరుగుతున్నా చర్యలు తీసుకోవాల్సిన అధికారులు కూడా పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఈ ప్రాంతంలోనే శుక్రవారం స్థానిక గ్రామానికి చెందిన అధికారి పార్టీ నాయకులు యంత్రాలు పెట్టి ట్రాక్టర్లతో పట్టపగలే గ్రావెల్ తరలించడం గమనార్హం.